కఠిన చట్టాలను అమలు చేయాలి



ప్రస్తుతం మారుతున్న సమాజంలో మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలి. కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలిపై అఘాయిత్యం చేసి దారుణంగా చంపడం అమానుషం. వైద్య వృత్తిలో సేవలు అందిస్తున్న మహిళలపై అఘాయిత్యాలు, దాడులకు పాల్పడే దుర్మార్గులను కఠినంగా శిక్షించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి వారికి భద్రత కల్పించాలి. మహిళల రక్షణకు అమలు చేసే చట్టాలు నేరస్తులు భయపడేలా ఉండాలి.. అప్పుడే మార్పు వస్తుంది.

– నర్రా కృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, రెంటచింతల



ప్రత్యేక చట్టాలు ఉండాలి



కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. ఒక మహిళా వైద్యురాలిగా ఆమెకు నా నివాళి. ఇలాంటి ఘటనలు దేశంలో మరలా జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులకు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. మహిళలను చెడు దృష్టితో చూసేందుకు కూడా భయపడేలా ఆ చట్టాలు ఉండాలి. మహిళా వైద్యులకు రక్షణ కల్పించకపోతే రోగులకు ఏ విధంగా వైద్య సేవలందించాలి. ప్రభుత్వాలు ఆలోచించి నిందితులకు కఠినమైన శిక్ష వేయాలి. నేరస్తులను కఠినంగా శిక్షించాలి. మహిళా వైద్యులకు రాత్రి పూట డ్యూటీలు వేయకూడదు.

– థెరిసా, వైద్యురాలు, పీహెచ్‌సీ, శిరిగిరిపాడు

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారు మంగళవారం ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారి అమ్మవారిని ప్రత్యేకంగా ఒత్తులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వికలాంగుడు మృతి



వెల్దుర్తి: మండల కేంద్రమైన దుర్గిలో గత 10 సంవత్సరాలుగా భిక్షాటన చేస్తున్న జగన్నాధరెడ్డి (45) అనే వికలాంగుడు రోడ్డు పక్కన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు సూరె కృష్ణ, జనసేన నాయకులు రుద్రా రవి.. జగన్నాధరెడ్డి మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు మాట్లాడుతూ దుర్గిలో గత 10 ఏళ్లగా భిక్షాటన చేస్తూ జీవనం చేస్తున్న జగన్నాధరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకొని అతని అంత్యక్రియలు కుటుంబ సభ్యులతో దగ్గరుండి చేయించటం జరిగిందన్నారు.

ఎంపీపీగా పోతురెడ్డి సుజాత నేడు బాధ్యతల స్వీకరణ



మాచర్ల రూరల్: మాచర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా పోతురెడ్డి సుజాత నేడు పదవీబాధ్యతలు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో కె.సరోజినీదేవి మంగళవారం తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ మేరకు ఆమె బాధ్యతలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఎంపీపీగా పనిచేసిన బూడిద మంగమ్మ అనారోగ్యంతో దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో వైస్ ఎంపీపీగా ఉన్న పోతురెడ్డి సుజాత ఇన్‌చార్జి ఎంపీపీగా జెడ్పీ సీఈవో ఉత్తర్వుల మేరకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖాధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది



గురజాల : దాతల సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాధం అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులకు, నిరుపేదలకు ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సేవా కార్యక్రమాలు కొనసాగించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. నేలవల్లి బుల్లయ్య, శరమాళ్ళ హనుమంతరావు, నీలం రాజు, సోలసా కిషోర్, పోటు నాగేశ్వరరావు తదితరులున్నారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఎస్‌ఐ రాజేష్



బెల్లంకొండ: వచ్చే నెల 7న వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు ముందుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేయు ప్రదేశం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించేది వంటి వివరాలను తెలియజేయాలని సూచించారు. తద్వారా సమస్యాత్మక ప్రదేశాలలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూజలు జరుపుకోవాలని, అధిక శబ్దంతో మైకుల ఏర్పాటు నిషేధమని తెలిపారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుదీకరణ పనులకు శంకుస్థాపన

సత్తెనపల్లి: పట్టణంలోని ఏపీ టిడ్కో గృహ సముదాయం వద్ద విద్యుదీకరణ పనులకు స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు నీరు అందేనా..!?

- ఆకురాజుపల్లి మేజర్ కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము
- బాగా పెరిగిన గుర్రపు డెక్క
- దీంతో నీటి ప్రవాహం అంతంత మాత్రమే



ఆకురాజుపల్లి మేజర్ కాలువలో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న గుర్రపు డెక్క



ఆకురాజుపల్లి మేజర్ కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము

పిడుగురాళ్ల: రైతులు పండించే పంటకు సాగునీరు ఆకురాజుపల్లి మేజర్ కెనాల్ ద్వారా అందుతుంది. గతంలో సాగుకు ముందుగానే ఆకురాజుపల్లి మేజర్ కాలువలో పెరిగిన ముళ్ల కంప, జమ్ము, గుర్రపు డెక్క వంటివి శుభ్రం చేసి ఉంచేవారు. గతంలో ఖరీఫ్ సాగు సమయానికి సాగర్ కుడి కాలువ ద్వారా ఆకురాజుపల్లి మేజర్ కాలువకు నీరు విడుదల చేసే సమయానికి కాలువలను శుభ్రం చేసేవారు. కానీ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగర్ కెనాల్ ద్వారా ఆకురాజుపల్లి మేజర్ కాలువకు నీరు విడుదల చేసినప్పటికీ కాలువల్లో జమ్ము, ముళ్ల పొదలు, గుర్రపు డెక్క ఏపుగా పెరగటంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో ఆకురాజుపల్లి మేజర్ కాలువకు సాగు నీరు విడుదల చేసినప్పటికీ ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. కాలువ చివరి భూముల రైతులకు కాలువ పారుదల తగ్గుతుంది. కాలువ అభివృద్ధి పనులు ముందుగానే చేసినట్లయితే నీటిపారుదల బాగుండేదని రైతులు తెలుపుతున్నారు.

21 కిలో మీటర్ల జంగిల్ సమస్య

ఆకురాజుపల్లి కెనాల్ 21 కిలో మీటర్ల మేర ఉంది. ఈ 21 కిలో మీటర్ల మేర జంగిల్‌లా ముళ్ల చెట్లు, జమ్ము, గుర్రపు డెక్క పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి. ఇరిగేషన్ అధికారులు ఈ కాలువ అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ముందస్తు ప్రణాళికలు వేసి శుభ్రం చేస్తే రైతులకు ఈ సమస్య ఉండేది కాదు. కాలువకు నీరు వస్తున్నా పూర్తిస్థాయిలతో సాగుకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

25 వేల ఎకరాలకు ఈ కాలువే ఆధారం

ఆకురాజుపల్లి మేజర్ కాలువ ద్వారా పిడుగురాళ్ల, మాచవరం మండలంలోని పలు గ్రామాలలో సాగుకు నీరు అందుతుంది. 25 వేల ఎకరాల సాగు భూమికి ఈ కాలువ ద్వారానే సాగు నీరు అందుతుంది. ఇప్పుడు ఈ కాలువ ద్వారా సాగుకు నీరు పారుదల తగ్గటంతో చివరి భూములకు నీరు అందని పరిస్థితి. కాలువ ఆధునీకరణ పనులు చేస్తే చివరి భూములకు సైతం ఈ కాలువ ద్వారా నీరు అందే అవకాశం ఉంది.

రూ.80 లక్షల అంచనాలు పంపాం

ఆకురాజుపల్లి మేజర్ కెనాల్ పరిధిలో సుమారు 21 కిలో మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్, గుర్రపు డెక్క, జమ్ము, ముళ్ల పొదలు వంటివి తొలగించేందుకు రూ.80 లక్షల అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించటం జరిగింది. నిధులు మంజూరు కాకపోవటంతో జంగిల్ క్లియరెన్స్ చేయలేకపోయాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– బండి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ, పిడుగురాళ్ల

సాగు నీరు అందటం లేదు



ఆకురాజుపల్లి మేజర్ కాలువలో జమ్ము, గుర్రపు డెక్క బాగా పెరిగాయి. దీంతో సాగు నీరు పూర్తిస్థాయిలో అందటం లేదు. కాలువ బాగు చేస్తే నీటి ప్రవాహం అంది సాగుకు నీరు సమృద్ధిగా వస్తుంది.

– నరసింహారెడ్డి, రైతు, పిడుగురాళ్ల


కాలువలు ఎప్పటికప్పుడు బాగు చేస్తే మేలు



ఆకురాజుపల్లి మేజర్ కాలువకు గతంలో ఖరీఫ్ సమయం ముందుగానే కాలువలను శుభ్రం చేసి సాగునీరు అందించారు. ఇప్పుడు కూడా సాగునీరు వస్తుంది. కానీ కాలువలను శుభ్రం చేస్తే నీటి ప్రవాహం బాగా వచ్చి నీరు పూర్తిస్థాయిలో అందుతుంది.

–రవి, రైతు, పిడుగురాళ్ల

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



రెంటచింతలలోని కృష్ణుని దేవాలయంలో లక్ష తులసీ దళార్చన



లక్ష తులసీ దళార్చన కార్యక్రమంలో భక్తులు

రెంటచింతల: మండలంలోని గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని శ్రీకృష్ణుని దేవాలయంలో అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో పలువురు వేద పండితులు స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకాలు, సుదర్శన హోమం, లక్షతులసి దళార్చన నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో గొట్టిపాళ్ళ కృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు, కీర్తనలు, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదానం చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యాదవ రాజు యువకులు ఉల్లాసంగా... ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి మేళతాలాతో గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతులకు శాపం





జమ్మలమడక, మల్లవరం రైతులు వెళ్లే రహదారిలో దట్టంగా పెరిగిన ముళ్ల కంప

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే అన్నదాతలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రహదారులలో దట్టంగా ముళ్ల కంపలు పెరిగి దారి మూసుకు పోతూ రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పరిస్థితి మండలంలోని జమ్మలమడక గ్రామ శివారులో ఉంది. నాగార్జున సాగర్ కుడి కాలువ పక్కనే ఉన్న మల్లవరం మేజర్ కాలువకు వెళ్లే రహదారిలో తుమ్మ చెట్లు భారీగా పెరిగి రహదారి పూర్తిగా మూసుకు పోయింది. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులకు రైతులు అర్జీ రూపంలో అందించటమే కాకుండా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేసినా అధికారులు స్పందించలేదని రైతులు వాపోతున్నారు. సాగు నీటి కాలువ నిర్వహణను ఎటూ బాగు చేయటం లేదు. కనీసం కరకట్టల వెంట ముళ్ల కంపలు, పిచ్చి చెట్ల తొలగింపు పైన అయినా దృష్టి పెట్టకపోవటంపై వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సాగర్ కుడికాలువ నీరు విడుదల కావటం, వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభమవుతున్న తరుణంలో వ్యవసాయ యంత్రాలను తీసుకొని ఈ రహదారులలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మేజర్ కాలువ సమీపంలోని రహదారిలో ముళ్ల కంపలను తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పీడబ్ల్యూడీ ఏఈ హిమబిందును వివరణ కోరగా ఈ రహదారుల ప్రాంతాలలో జంగిల్ క్లియరెన్స్ కోసం ప్రభుత్వానికి నివేదిక అందించాం. శాంక్షన్ ఆర్డర్ రాగానే జేసీబీతో పూర్తిగా చెట్లను తొలగించేందుకు సిద్ధంగా ఉన్నాం. తాత్కాలికంగా రైతులకు నడక, వాహనాలు రాకపోకలు కొనసాగించేందుకు తగు ఏర్పాట్లు చేసే విధంగా సిబ్బందికి ఆదేశాలు అందిస్తున్నట్లు ఆమె చెప్పారు.

పెద్దింటమ్మతల్లికి గాజులతో అలంకరణ



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మతల్లికి శ్రావణ మంగళవారం పురస్కరించుకుని గాజులతో అలంకారం చేశారు. తొలుత పంచామృతాభిషేకం, అనంతరం గాజులతో విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్దింటమ్మ అమ్మవారి సన్నిధిలో సామూహిక శ్రావణ మంగళవార పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దింటమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

6 బస్సులపై కేసు నమోదు

గురజాల : అనుమతులు లేకుండా తిరుగుతున్న 6 ప్రైవేట్ పాఠశాలల బస్సులపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి కేసు నమోదు చేశారు. మండలంలోని పాఠశాలల బస్సులను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 6 బస్సులపై కేసు నమోదు చేశారు. అందుకు గాను రూ.31,250 అపరాధ రుసుం విధించినట్లు ఎంవీఐ శేషిరెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాదారులు వ్యవహరించరాదన్నారు.

గొంతెండి మృతి చెందిన వ్యక్తి



గురజాల : అతిగా మద్యం తాగి పడిపోయి గొంతెండి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మల్లెల ప్రసాద్ (45) మంగళవారం అధికంగా మద్యం తాగి లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో కింద పడిపోయాడు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండటం వలన గొంతు ఎండి పోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు.

చల్లగా చూడమ్మ... పోలేరమ్మ తల్లి

పెదకూరపాడు: చల్లగా చూడమ్మ పోలేరమ్మ తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని కోర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ దేవాలయం వార్షికోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల్లో మహిళలు అనేక మంది తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లను సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలి

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల, పాలువాయి గ్రామాలలో చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది 24,257.81 ఎకరాలలో సాగు భూములలో వివిధ రకాల పంటలను వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 10,731.55 ఎకరాలలో పత్తి, మిర్చి, వరి, కంది తదితర పంటలను రైతులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సుమారు 6,374 ఎకరాలలో సాగు చేస్తున్న పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు వీఆర్వోలు సంయుక్తంగా ఈ–క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వలన రైతులు, కౌలు రైతులు కూడా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఏవో వెంట వీఏఏలు సతీష్, వెంకటేష్, రాంబాబు, రైతులు తదితరులున్నారు.

మదర్ థెరిసా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి



మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి తదితరులు



మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు

పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి

రెంటచింతల: ప్రపంచ ప్రజలందరిచేత తల్లిగా కొనియాడబడిన మదర్ థెరిసా జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షులు ఎస్.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రార్థించే పెదవుల కన్న సహాయం చేసే చేతులు మిన్న అని నిరూపిస్తూ అనాథలకు సేవ చేశారని గుర్తు చేశారు. ఎందరో కుష్టు రోగులు, నిర్భాగ్యులు, అనాథలను అక్కున చేర్చుకుని వారికి సేవ చేసిన మహనీయురాలు థెరిసా అన్నారు. యుగోస్లేవియా దేశంలో జన్మించిన థెరిసా భారత పౌరసత్వం తీసుకుని 123 దేశాలలో అట్టడుగు వర్గాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేసిన మానవతామూర్తి అని కొనియాడారు. ఆమె చేసిన సేవలను గుర్తించి నోబెల్ శాంతి పురస్కారం, భారతరత్నతో భారత ప్రభుత్వం ఘనంగా సత్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమ, మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ అంకమ్మరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఏడీ శర్మ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు ఎనలేనివి

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో విశ్వమాత మదర్ థెరిసా జయంతిని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ స్థానిక వివేకానంద ఆశ్రమంలో మదర్ థెరిసా జన్మదిన వేడుకలను ప్రతి ఏటా నిర్వహించటం సంతోషకరమన్నారు. మదర్ థెరిసా దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. విద్యార్థులు మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పేదల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ చిలంకూరి నాగిరెడ్డి, సమితి అధ్యక్షుడు జి.కిరీటిరెడ్డి, పోలిశెట్టి పిచ్చయ్య, కాలనీ వాసులు, చిన్నారులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు 'పీఎం జన్మన్'

వెల్దుర్తి: చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పీఎం జన్మన్ కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించేందుకు షెడ్యూలును విడుదల చేస్తున్నట్లు ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ చెంచుల జీవన విధానం, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు అందించటమే ధ్యేయంగా చెంచు ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకొని సత్వరమే సేవలందించేందుకు 28 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు క్యాంపు కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు మండల స్థాయిలో 10 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 28వ తేదీన హనుమాపురం తండా, 29న కుంకుడు చెట్లు తండా, సిలువ కొండ, దావుపల్లి, 30న బటుకులపాయ, వజ్రాలపాడు, సేవానాయక్ తండా, 2న లోయపల్లి, మిట్టమీదిపల్లె, 3న శివలింగాపురం, యర్రబాలెం, గుడిపాడు చెరువు, 4న మండాది, చిన పర్లపాయ తండా, 5న శ్రీరాంపురం తండా, రచ్చమల్లపాడు, 6న జెండా పెంట, గొట్టిపాళ్ళ, వెల్దుర్తి, గంగిరెడ్డిపల్లెలో గ్రామ సభలు జరుగుతాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, చెంచు గూడెంలలో దండోరా వేసి కార్యక్రమాలు వివరించాలని కోరారు.

ప్రకృతి సాగుకు జీవామృతం శ్రీరామ రక్ష



జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

పెదకూరపాడు: ప్రకృతి సాగుకు జీవామృతం శ్రీరామ రక్షణ అని 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి సాగుపై జీవశాస్త్ర ఉపాధ్యాయుడు యక్కంటి విజయ భాస్కర్ రెడ్డి అవగాహన, జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం తయారీకి పది కిలోల ఆవుపేడ, పదిలీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల శనగపిండి, రెండు కిలోల బెల్లం, ఒక కిలో మట్టి, 200 లీటర్ల నీరు కలిపి బాగా కలియ తిప్పాలన్నారు. ఈ విధానాన్ని విద్యార్థులచే చేయించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కలియ తిప్పాలని, ఐదు రోజుల పాటు తిప్పితే జీవామృతం వినియోగించుకోవచ్చన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జీవామృతం తయారు చేసి పాఠశాల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు పండించి పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అరుణశ్రీ, ఉపాధ్యాయులు బాలకృష్ణ రెడ్డి, రమేష్, కోటేశ్వరరావు, పీసీ చైర్మన్ గంటా పున్నారావులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న ముసాయిదా ఓటర్ల జాబితా తనిఖీల్లో భాగంగా ఇంటింటి సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ మంగళవారం పరిశీలించారు. ఒకే ఇంటి నంబర్‌తో ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం, జీరో డోర్ నంబర్‌లో ఓటర్ల నమోదు కావడం వంటి తప్పిదాలు లేకుండా పరిశీలించారు. ఓటరు జాబితాలో ఉన్నట్లుగా ఓటరు ఆ ఇంటిలో నివస్తున్నాడా లేదా అని, అలాగే గతంలో ఓటు ఎక్కడైనా ఉంటే దాన్ని రద్దు చేసుకునేలా చూడాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో పేరు సవరణ, ఫొటో మార్పు కొనుటకు దరఖాస్తు అందించవచ్చని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న ఐటీసీ సెర్ప్ ప్రతినిధి సతీష్

క్రోసూరు: ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై మండల క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐటీసీ సెర్ప్ ప్రతినిధి ఎస్.సతీష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, పీఎం జేజేవై, పీఎం ఎస్‌బీవై వంటి జీవిత బీమా పథకాల ద్వారా గ్రామాలలోని పేదలకు ఆరోగ్యం, బీమా ప్రయోజనాలు ఏ విధంగా కలుగుతాయో తెలిపారు. దాంతో పాటు పీఎం ముద్ర యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన ప్రయోజనాలను వివరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ప్రయోజనం పొందడంతో పాటు ప్రతి ఒక్కరు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అన్ని పంచాయతీల క్లాప్ మిత్రలు, ఐటీసీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సీహెచ్ బొల్లయ్య పాల్గొన్నారు.